# మేకపిల్ల

[కథానిక]

శ్రీ రా. సీ. ఆంజనేయశాస్త్రి

బుద్ధభగవానుని పాలరాతివిగ్రహంముందు వెండి ప్రమిదలోని దీపం నిశ్చలంగా వెలుగుతోంది. ఎదురుగా ఉన్న కిటికీలోంచి త్రయోదశీచంద్రుని ముదురుకిరణాలు జాజివాసనలు మోసుకొచ్చి తథాగతుని స్నిగ్ధకపోలాలకు మెరుగులు దిద్దుతున్నాయి. దీపకళికలోంచి బయలుదేరిన సూక్ష్మధూమరేఖ బోధిసత్వుని అర్ధనిమీలితనేత్రాల్ని తెరిపించటానికి ప్రాధేయపడుతూ వాటిచుట్టూ ప్రదక్షిణాలు చేస్తోంది. ధావళ్యంలో గౌతమదేవుని కేమాత్రం తీసిపోని మేకపిల్ల, కొమ్ములతో వారి పాదాల్ని స్పృశించి, ఆ ప్రశాంత గంభీరవదనంలోకి చూసి "మె! మ్మే!!" అంటూ ఒక్క గంతులో ముందుసావిట్లో కొచ్చింది.

ముందుసావిట్లో మంచంమీద నందుడు పడుకునున్నాడు. మూడే ళ్లుంటాయి. కిందటిరాత్రినుంచీ మన స్పృహే లేదు. చుట్టూ చేరిన బంధువులూ, తల్లీ, మామ్మా దుఃఖాన్ని దిగమింగుకుంటూ ఆదుర్దాగా చూస్తున్నారు. మేకపిల్ల మంచంచుట్టూ తిరుగుతూ నందునిమీద ఉన్న దుప్పటిని మునిపళ్లతో కొలిక లాగుతూ "మె! మ్మే!!" అని అరుస్తోంది మెల్లిగా. ఒక్కొక్కప్పుడు అతిగంభీరంగా నందుని మొహంలోకి చూసి, ఎంతసేపటికీ వాడు కళ్లు తెరవకపోతే, ఉలిక్కిపడి, ఒళ్లు దులపరించి బుద్ధభగవానుడున్న గదిలోకి పరుగెత్తుతుంది.

నందుని ముంగురులు నాలికతో నాకినా, కొమ్ముల చిరుకొనలతో వాడి కపోలాలు స్పృశించినా, మేకపిల్లను ఎవరూ అదల్చరు. పుట్టినప్పటినుంచీ వాళ్లిద్దరికీ అంత స్నేహం. ఆడుకునేప్పుడు ముందు కాళ్లు రెండూ ఎత్తి నందుడి తలమీద పెట్టేది మేకపిల్ల ఎంతో ఒడుపుగా. వాడు కిలకిలా నవ్వుతూ పట్టుకుచ్చులాంటి దాని వెంట్రుకలను జడలల్లేవాడు. ఒక్కొక్కప్పుడు నందుడితోపాటు పరుపుమీదే పడుకునేది మేకపిల్లకూడాను. దానికి నీళ్లు పోస్తేనేకాని తను నీళ్లు పోయించుకునేవాడు కాదు నందుడు. తనకి సబ్బు పెట్టి రుద్దితే మేకపిల్లకీ రుద్దాల్సిందే! అన్నం తినేటప్పుడు కూడా మేకపిల్ల దగ్గిరుంటేనేగాని ముద్ద దిగేదికాదు. లేత గరికా, జొన్న కంకులూ తనే మేకపిల్ల నోటికందిస్తూ తనుకూడా ఓ పరక కొరికేవాడు నందుడు. మేకపిల్ల చెంగున గంతేసి నందుడి నోట్లోంచి ఆ పరకని తన మునిపళ్లతో పట్టుకు లాగి "మె! మె!! మ్మే!!!" అంటూ నందుడి బుజ్జిపొట్టమీద కుమ్మబోయేట్లుగా చక్కిలిగిలిపెట్టేది. వాడు ఆచక్కిలిగిలికి పకపకలాడుతూ "మా! మ్మా!! అమ్మా!!!" అంటూ మేకపిల్ల చెవులు పట్టుకుని యుద్ధం చేసినట్లు ఎగబడేవాడు. వాళ్లిద్దరికీ తెలిసిన భాషేదో వుంది. మేకపిల్ల "మె! మ్మే!!" అంటే చాలు, నందుడు తల్లిదగ్గిర పాలు తాగుతున్నా సరే పరిగెత్తుకెళ్లాల్సిందే! నందుడికి మాటలు రానప్పుడు "మా! మ్మా!! అమ్మా!!!" అనే శబ్దాలతోనే అన్నివిషయాలూ అర్థమయేటట్లు మేకపిల్లకి చెప్పేసేవాడు. క్రమంగా వాడికి మాటలు రావటంతో, మేకపిల్లకికూడా మనిషి భాష అర్థమైపోవటం మొదలెట్టింది. "మె!! మ్మె!! మ్మే!!" అనే ధ్వనులతో అది అన్నింటికీ సమాధానాలు చెప్పటంకూడా నేర్చుకుంది. నందుడితో పాటు పొద్దున్నే నీళ్లు పోసుకుంటేనేగాని గడ్డిపర

కన్నా ముట్టుకోదు. తోటలో విడిచిపెట్టేసినా దొండపాదు, కాకరతీగె, బెండమొక్కలూ, పొట్ల పందిరీ ముట్టుకోనే ముట్టుకోదు. గరికెరెబ్బలూ, చికిలింతా ఏరుకుతింటుంది. దొడ్లో పొగడచెట్టుకింద యిద్దరూ ఆడుకుని ఆడుకుని అలిసిపోతారు. మేకపిల్ల చెట్టునీడనే పడుకుంటుంది. నందుడు మొఖమల్లు వంటి దాని డొక్కలో తల పెట్టి నిశ్చింతగా నిద్రపోతాడు. ఖాదీవెండిలాగా మెరమెరలాడే మేకపిల్లను కావిలించుకుని పడుకున్న కస్తూరిబొమ్మలాంటి నల్ల నందుడిని చూసి వాళ్లమ్మ ఎంతో మురిసిపోయేది. వాళ్ల మామ్మకిమటుకు నందుడిమీద కోపంగా వుండేది పాడుమేకపిల్లతో ఆట లేమి టని. మేకపిల్ల మీద ఆవిడికి అసహ్యంకూడాను. కాని మనమడిమీద అమితమైన మమకారం-వాడు మూడుమూర్తులా తాతగారి పోలికవడంచేత. ఓమాటు మామ్మ మేకపిల్లని విదలిస్తూ ఒక పూచికపుల్లతో కొట్టబోయింది. నందుడు యింతింత కళ్లు చేసుకుని, ఆ పుల్ల పట్టుకుని మామ్మమీద విరుచుకుపడ్డాడు. ఎంత "అభిమానం రా నీకు వెధవ మేకపిల్లంటేనూ?" అని ఆవిడ నవ్వుకుని మనమణ్ణి ముద్దెట్టుకుంది. ఇదంతా చూస్తున్న మేకపిల్ల "మే! మ్మే!!" అనేసరికి నందుడు మామ్మకంట్లో పూచికపుల్లతో పొడిచి, జబ్బమీద కరిచి ఒక్క అంగలో దూకి మేకపిల్ల మెడ కావిలించుకున్నాడు. "మే! మ్మే!!" భాషలో అది నందుడితో ఏం చెప్పిందో ఏమో! వాడు మామ్మకేసి చూసి ఒకటే నవ్వడమూ, అది "మే! మ్మే!!" అంటూ గంతు లెయ్యడమూ! అలా చిందులు తొక్కుతుంటూనే వాళ్లిద్దరూ తోటలో కెళ్లిపోయారు.

ఓమాటేమైందంటే, నందుడూ మేకపిల్లా వీథిలో ఆడుకుంటూంటే "బొంయ్! బొంయ్!!" మంటూ ఓ కొత్త కుక్క మొరుక్కుంటూ ఒచ్చి నందుడిమీద పడింది. వాడు కెవ్వుమని కేకేసి మేకపిల్ల మెడ కావిలించుకున్నాడు. కాస్తుంటే కుక్క నందుడి తొడకండలు పీకి పోగులు పెట్టేదే! మేకపిల్ల వెంటనే మెడ ఒక్క విసురు విసిరేసరికి నందుడు కిందపడ్డాడు. అమాంతం అది కుక్కమీద దూకి కొమ్ములతో పొడిచి పడేసి తొక్కటం మొదలెట్టింది. కరిచి ముక్కలు చేసేదే కాని మాంసంవాసన గిట్టక ఊరుకుంది. మేకపిల్ల ముందు ఏమీ చెయ్యలేక, కుక్క గిలగిలా తన్నుకుంటూ, అందినంతవరకు దాని కాళ్లని తెగకరిచి విడిచిపెట్టింది. ఇంతలోకే దోవనపోయేవాళ్లొచ్చి కుక్కని తోలేశారు. మేకపిల్ల కాళ్లంతా నెత్తురు ముద్దవటం చూసి నందు ఏడవటం మొదలెట్టాడు. దాని కాళ్లు కడిగి కట్టుకట్టేదాకా వాడు మెతుకు కొరకలేదు. తరవాత చాలా రోజులికిగాని దాని కాళ్లు సొంతం నయంకాలేదు. ఆ కుక్క పిచ్చిదిటకూడాను. ఆనాటినుంచీ మామ్మకి మేకపిల్లమీద అసహ్యం కొంచెం తగ్గింది కాని, సొంతం పోలేదు. నందుడు చూడకుండా దాన్ని అప్పుడప్పుడు కసురుతూనే ఉంటుంది. ఆ సంగతి మేకపిల్ల నందుడికి చెప్పితే యిద్దరూ నవ్వుకునేవాళ్లు. ఆవిడ నెవరూ లక్ష్యపెట్టేవాళ్లు కాదు.

అసలు మేకపిల్ల వాళ్లింటికి మూడేళ్లక్రితం రావటంకూడా తమాషాగానే జరిగింది—ఆకిందటి రాత్రినుంచే ఛాయాదేవికి ప్రసవవేదన జాస్తిఅయింది బాగా. తెల్లారబోతోంది. అంతకుముందే లేచిన పీతాంబరుడు స్నానాదులు ముగించుకుని దక్షిణంవేపు గదికిటికీ తెరిచి "ధమ్మపదము" తీశాడు చదువుదామని. వీథిమూల కిటికీ కెదురుగా ఒక మేక మరణవేదన పడుతోంది. అప్పుడే పుట్టిన ఒక మచ్చలపిల్లని కుక్క లాక్కెళ్లటం కళ్లారా చూసి పీతాంబరుడు బొటబొటా కన్నీరు కార్చాడు. తన భార్య ప్రసవవేదనపడుతుంటే, ఎంతమంది డాక్టర్లు? ఎంతమంది నౌకర్లు? మరి యీ మేకకి పుట్టిన పిల్లనన్నా కనీసం కుక్క నోట పడకుండా కాపాడేవాళ్లెరూ లేరే! పీతాంబరుడు "ధమ్మపదము" మూసేసి పరిగెత్తుకొచ్చాడు వీథిలోకి. ఇంకా మనుష్యు లెవరూ నడవటంలేదు. రాత్రి ఆ దారిన వెళ్లిన మేకలమందగిట్టల ముద్రలు నేలమీద కనిపిస్తూనేవున్నాయి. పాపం, ప్రసవించనున్న యీ మేక నడవలేకపోయింది కామాలు! గొల్లవాడూ నిద్రకళలో మరిచిపోయి వెళ్లుంటాడు. పీతాంబరుడు

వెళ్ళేసరికి కుక్క పారిపోయింది. అంతకు ముందు పుట్టిన రెండుపిల్లల్నీ కూడా ఆ కుక్కే పొట్టనపెట్టుకునివుంటుంది. వాటితాలూకు కాళ్లు అక్కడే పడివున్నాయి. అసలు తల్లి మేకనుకూడా కుక్క చాలా చోట్ల కరిచేసింది. పీతాంబరుడు మేక మేను తడిమాడు. నెత్తురు తుడిచి కట్టుకడుతుంటే యింకో పిల్ల పుట్టింది. ఇక తల్లికి సేవ అక్కర్లేదు. ఆ పిల్లని పీతాంబరుడికి అప్పజెప్పి, తనయందు ఒక మానవమాత్రుడు చూపిన దయ కెంతో కృతజ్ఞత సూచిస్తున్నట్టుగా, పీతాంబరుడి మొహంలోకి జాలిగా చూస్తూ తల్లిమేక కళ్లు మూసింది శాశ్వతంగా... మేకపిల్లని ఎత్తుకుని యింట్లో అడుగుపెడుతుంటే దాసిది పకపకలాడుతూ వచ్చి "మొగపిల్లాడు బాబయ్యగారూ !" అంది. పీతాంబరుడు ప్రశాంతగంభీరతతో "సరే ! దీన్నికూడా పెంచమను. దీని తల్లి చచ్చిపోయిందికూడాను" అంటూ మేకపిల్లని దాసి కిచ్చాడు...

ఆరాత్రే పీతాంబరుడు బ్రహ్మకపాలానికి బయలుదేరి వెళ్లాడు. చిన్నతనంలోనే పెళ్లవడం చేతనూ, తండ్రిని ఎదిరించటానికి కొంచెం జంకడంచేతనూ, పీతాంబరుడు గృహస్థాశ్రమధర్మాన్ని సాక్షీమాత్రంగా నిర్వహించాడు తప్పితే అతనికి సంసారంమీద ఏ మాత్రమూ ఆస్థ లేదు. వేదాంతశాస్త్రంలో పట్టభద్రుడైనప్పుడే అతనిలో కలిగిన పరివర్తనకు న్యాయశాస్త్ర పఠనం మరింత దోహద మిచ్చింది. తన కొడుకు పేరు ప్రఖ్యాతులు గల న్యాయవాది అవుతాడని పీతాంబరుని తండ్రి ఎంతో ఉబలాటపడి పట్టా కట్టించాడు. తరవాత కొద్దికాలానికే తండ్రి గతించడంచేత పీతాంబరుడు న్యాయస్థానాని కెళ్లటంకూడా మానేశాడు. ఇల్లువాకిలి విడిచి దేశాటన కేనాడో బయలుదేరివుండేవాడేగాని గర్భవతి అయిన భార్య సజలనేత్రాలతో శిశూదయం అయేవరకు ఉండవలసిందిగా కోరితే కాదనలేకపోయాడు. ఆమె కెందుకనో భయం, తన భర్త తిరిగి రాడని. సరే, పుత్రోదయం అయింది. భార్య కన్నీరిక పీతాంబరుని కాళ్లకి సంకెళ్లు వెయ్యలేవు. ఆ సంగతి ఛాయాదేవికీ తెలుసు. బయలుదేరేముందు, పురిటిగది గుమ్మందగ్గిరి కొచ్చిన భర్తతో "అబ్బాయిని చూశారా ?" అంది సార్థకధ్వనితో. తన కన్నీటికి లేని శృంఖలాశక్తి పదిహేను గంటల వయస్సు గల శిశువు కుంటుందా ? పీతాంబరుడు మందహాసం చేసి "చూశాను" అన్నాడు. తల్లికోరిక తీరుద్దామని పీతాంబరు డెన్నడూ అనుకోలేదు. ఆజన్మాంతం కాని, కనీసం తాను దాటిపోయేవరకుగాని యిల్లు విడిచిపెట్టవద్దని ఆమె పీతాంబరుని కోరింది. ఆకోరిక తీర్చడం అసాధ్యం. తన పాదాలకు నమస్కరించి శెలవు తీసుకుంటున్న కుమారుని కౌగలించుకుని తల్లి భోరున ఏడ్చింది. ఆమెకీ భయమే, పీతాంబరుడు తిరిగి రాడని. ఆమాట అతని నోట అనిపించి వినటాని కిష్టం లేక "ఎప్పుడు తిరిగొస్తావు ?" అని అడగనేలేదు ఎవరూను.

పీతాంబరుడు కాశీ చేరినట్లుమాత్రం కబురు తెలిసింది. తరవాత, అతను హరిద్వారం వెళ్లటానికని ఎక్కిన రైలు ప్రమాదానికి గురిఅయిందనీ, మరణించిన వారిలో కొందరిని గుర్తుపట్టటానికే వీలుపడలేదనీ కాశీలోని అతని మిత్రులద్వారా ఛాయాదేవికి మరొక వార్త వచ్చింది. అంతే. ఏళ్లు గడిచిపోయాయి. పీతాంబరు డేమయ్యాడో ఎవరికీ తెలీదు. బహుశః ఆ రైలుప్రమాదంలో మరణించివుంటాడనే అంతా నిశ్చయించుకున్నారు. కాని మరణించినట్లు ధృవపడలేదు కనక ఛాయాదేవి ముత్తయిదురూపాని కేమీ మార్పు కలగజెయ్యలేదు సంఘం...

పరిస్థితుల ప్రభావంవల్ల ఛాయాదేవికికూడా వైరాగ్యగుణం అలవడింది. తన భర్తభావాల్నీ, నడకల్నీ, అలవాట్లనీ అనుకరించడంలో ఆమె కోవిధమైన మానసిక తృప్తి కలిగేది. భౌతికంగా నందుడు ఊరటకి కారణమయ్యాడు. ఇంత స్థితిగల కుటుంబంకనక అన్నవస్త్రాల కేమీ లోటు లేకపోయింది. పీతాంబరుడి తల్లి తన భర్త మృతికి పడిన దుఃఖం యింతా అంతా కాదు. మనమడు పుట్టినందుకు కలిగిన సంతోషానికీ మేర లేదు. కొడుకు దేశంపాలై, బతికున్నాడో లేదో అనే స్థితిని కల్పించేసరికి మళ్లీ కడుపు చెరువైంది. అప్పుడప్పుడు బాగా ఏడుస్తుంది. తన కున్నంత దుఃఖం కోడలికి

లేదనికూడా ఎత్తిపొడిచిందికూడాను ఒకటిరెండుసార్లు. ఏమైనా తనుమాత్రం చేయగలిగిం దేముంది? మరణించిన భర్తనీ, సజీవుడో కాదో తెలీని కొడుకునీ కూడా యీ మనమడిలోనే చూసుకుంటూ, మురుస్తూ ఏడుస్తూ రోజులు వెళ్లదీస్తోంది.

అలాంటి నందుడే యిప్పుడు మరణశయ్యమీద వుండేసరికి మామ్మకిగాని, అమ్మకిగాని కాళ్లూ, చేతులూ ఆడటం లేదు. ఊళ్లోనా, అమ్మవారు ఊహూ వాల్లాడిపోతోంది. గ్రామస్థులంతా కొలుపు చేస్తామని మొక్కుకున్నారు కూడాను. ఊళ్లో గడపకో మేకపోతుచొప్పున బలివ్వటానికి నిశ్చయించారు. మత్స్యమాంసాలు తినే కులంవాళ్లెవరూ అందుకు వ్యతిరేకించలేదు. అమ్మవారి కొలుపుసంఘంవాళ్లు యింటింటికీ వెళ్లి మీదులు కట్టించారు. బ్రాహ్మల్నీ, కోమట్లనీమటుకు వాళ్లు ఒత్తిడిచెయ్యలేదు—వాళ్లు మాంసం తినరుకనక. కాని అమ్మవారి కేం ఆగ్రహం ఒస్తుందోనని వాళ్లల్లోకూడా కొంతమంది, పదిహేనూ యిరవయ్యో యిచ్చి, తమ పేరునకూడా ఒక వేటని వెయ్యవలసిందిగా కొలుపుసంఘాన్ని కోరారు.

పీతాంబరుడు మొదటినుంచీ అహింసాపరుడనీ, క్షత్రియుడైనప్పటికీ మాంసాదు లేనాడో వర్జించాడనీ ఊరంతా తెలుసు. "అపరబుద్ధుడు వెలిశాడయ్యా!"అని చాటున అతన్ని హేళనచేసేవాళ్లు కూడా వున్నారు. ఇప్పుడతను ఉంటే, ఒక ఆట ఆడించి విడిచిపెట్టేవాళ్లు. "మేకపోతును వేయించడమో, లేకపోతే వెలేసి ఊళ్లోంచి వెళ్లగొట్టడమో జరిగితీరేది. పాపం, ఉన్నది ఆడవాళ్లు. ఇవ్వనే యిస్తారు. అదీగాక మేకపోతుకూడా వాళ్లింట్లోనే వుంది. పీతాంబరుణ్ని సాధించటం మాత్రం పడదు."—ఇన్నీ అనుకుంటూనే మూడు రోజుల క్రితం కొలుపుసంఘంవాళ్లు పీతాంబరుడింటికెళ్లి మీదుకట్టమన్నారు. ఛాయాదేవికి తన భర్త భావాలు బాగా తెలుసు. బుద్ధదేవుని పాలరాతి విగ్రహం ఆమెకి ప్రతిక్షణమూ భర్తనుజ్ఞప్తికి తెస్తుంది. ఒక క్షణం ఆలోచించి "మేము మీదుకట్టం" అని చెప్పించింది ఛాయాదేవి. కొలుపుసంఘంతరఫున వచ్చిన వీరడికి వీరావేశం ఒచ్చింది. వృకోదరాన్ని ఒక చేత్తోనూ, బుర్రమీసాల్ని ఒకచేత్తోనూ నిమురుతూ "ఊఁ...మీకు కూడా ఎక్కిందీ విషం? ఎలా కట్టరో చూస్తా...ఎల్లుండిరాత్రి మళ్లా ఒస్తాం" అంటూ వెళ్లిపోయాడు. ఈ విషయంలో వీరడికి ఊళ్లో పెద్దఆసాముల మద్దతు బాగా వుంది లోపాయికారీగా...

మామ్మకి గుండె పీచు పీచుమంటూనే వుంది. "దుష్టుముండాకొడుకుకూడాను వీరడు. అదీగాక అమ్మవారు తల్లి...ఒక్కగా నొక్కడు...పసివెధవ నందుడు...అనాదినుంచీ ఒస్తున్న ఆచారాలే కూడాను. ధర్మరాజులవారూ, శ్రీరామచంద్రులవారూ మాంసం తినేవాళ్లేట! ఈనాటికి కుర్రకారు బయలుదేరి "మేం అహింసాపరులం" అంటూ నోరు కట్టుకు కూర్చుంటే మటుకు ఆ అమ్మవారుతల్లి ఊరుకుంటుందేమిటి? అదీగాక యిలాంటి రోజుల్లోనా? ఊరంతా ఎత్తిపోతుంటేనూ! కోడలికి మరీ చాదస్తం! అసలు దానికి పిల్లాడిమీద అపేక్ష ఏడిసిందీ? ఎలా కన్నదో బాబూ రాయి కన్నట్టు! ఎల్లుండి వాళ్లొచ్చినప్పుడు చాటుగా ఓ పాతికరూపాయలు చేతులో పడేస్తే వాళ్లే అబ్బాయిపేరు చెప్పి ఒక వేటను వేసేస్తారు; సరిపోతుంది. ఈవిడికి తెలియాలా ఏమిటి? అసలు మేకపిల్లనే యిచ్చేస్తే! పిల్ల యేమిటి? పోతల్లేయిాంతెత్తు పెరిగింది. పిల్లాడిమీద పీడకూడా కొట్టుకుపోతుంది. కాని, పాపం, కుక్కతో యుద్ధంచేసి ఆనాడు పిల్లాడిప్రాణాలు రక్షించలేదూ! అయితే మటుకు? మేకజన్మ మేకజన్మే! ఏమో బాబూ! ఆవిడగారేమంటుందో? ఇంట్లో నాపెత్తనమా, మన్నా? మొగుడిరాజ్యం, తన రాజ్యమూను. కొడుకుల రాజ్యం కోడళ్ల రాజ్యమూను...నా కెందుకొచ్చిందిగానీ చాటుగా పాతికరూపాయలు ఆ వీరడి చేతిలో పోస్తే పని వెళ్లమారిపోతుంది..." అని నిశ్చయించుకుంది.

కొందరి పళ్లల్లో విషపుపన్ను ఉంటుందిట! వీరడు పళ్లు కొరుకుతూ వెళ్లిపోయినరాత్రే శాపం

పెట్టినట్టు, నందుడు ఉలిక్కిలికిపడటమూ, కలవరింతలూనూ! మామ్మ భయపడినట్టే జరిగింది. జడుసుకున్నాడేమోనని, సోమయాజులుగారి దగ్గిరి కెళ్లి రాత్రికి రాత్రి విభూతి తెచ్చిపెట్టింది. ఒళ్లు పేలిపోతోంది. తెల్లారి కాస్త జారినట్టే జారింది. ఓ మెతుకు కొరికాడో లేదో ప్రళయంగా మళ్లా ఒచ్చిపడింది. రాత్రినుంచీ మన స్పృహే లేకపోయె! అమ్మవారి చేష్టేనని మామ్మకి బాగా తెలిసిపోయింది. కోడలితోకూడా చెప్పేసింది. అమ్మవారికి మొక్కుకోమని. అత్తగారితో వాదించి లాభం లేదని ఛాయాదేవికి తెలుసు. ఆవిడ ఒద్దనీ కద్దనీ ఏమీ అనకుండా వూరుకునేసరికి సుముఖమే ననుకుంది మామ్మ.

మొన్నాడు రాత్రివేళ యమకింకరులల్లే కొలుపుసంఘంవాళ్లు వీరడిని ముందుపెట్టుకొచ్చారు. స్పృహ లేకుండా పడివున్న నందుణ్ణి చూసేసరికి వాళ్లకి చాలా సంతోషం కలిగింది. మామ్మ మొహం చూడగానే యిట్టే తెలిసిపోయింది మీదుకట్టడం ఆవిడ కిష్టమేనని. ఛాయాదేవిమటుకు ససేమిరా అంది అనడం. ఆమెకీ మనస్సులో పీకుతూనేవుంది. వీరడలా ఘూర్ణపడి వెళ్లడమూ, నందుడు మంచమెక్కడమూ, అత్తగారి నమ్మకమూ, చుట్టుపక్కలవాళ్లు చెప్పడమూ చూడగాచూడగా అదే నిజమనిపిస్తోంది. కాని తన భర్త ఏం చెప్పేవాడు? ఆయనే ఉంటే మీదుకట్టనిచ్చేవాడా? గౌతమదేవులు పెదిమెలు కదల్చకుండానే ఏమిటో ఉపదేశిస్తున్నట్లు కనిపిస్తున్నారు. తాను తన భర్తకు ద్రోహం చెయ్యలేదు. నందుడు పోయినాసరే!...'నందుడు పోవడం' అనే భావం మనస్సులో కొచ్చేసరికి ఛాయాదేవి కంపించిపోయింది. వాడుకూడా లేకపోతే యిహ దిక్కెవరు? మీదుకడితేనేగాని నందుడు బతకడని నిర్ధారణ చేసేశారు చేరినజనం, ఛాయాదేవితో సంప్రదించ నవసరం లేకుండానే. అసలు మీదుమాత్రం ఆవిడే కట్టాలని శాస్త్ర మేముంది? మామ్మ కిష్టమేనయ్యె! నిజానికి యింటిపెద్ద ఆవిడేకూడాను. అరుగుమీదకూర్చున్న పెద్దమనుష్యులు "అత్తా, కోడళ్లలో పెత్తనం ఎవరిది" అనే విషయంమీద న్యాయశాస్త్రచర్చకూడా జరిపారు. "అత్తదే పైచెయ్యి" అని వాళ్లు తీర్పుయిచ్చినా, యీ సందర్భంలోమటుకు రోగితల్లే మీదు కట్టాల్సివుంటుందని అభిప్రాయపడ్డారు. నలుగురూ ఒత్తిడిచేసేసరికి ఆమె ఏడుస్తూ లోపలి కెళ్లిపోయింది. ఈ అవిధేయత కొలుపుసంఘా న్నవమానించినట్టయింది. చివాలున నలుగురూ లేచారు. "మీపిల్లాడు మీకు దక్క"డని ఘంటాపథంగా చెప్పేసి. వీళ్లను వెలివేసే విధానం యావత్తూ చిత్తుగా నిర్ణయంచేసేశారు వీథిమూల జేరిన యువకులు.

మామ్మ లబ్బున మొత్తుకుని పాతికరూపాయలూ వీరడిచేతిలో పోసింది. ఆయన ఒక్క గిరాటువేసి "మొన్ననయితే సరిపోయేదేమో! ఆ దశ దాటిపోయింది. అదిగో కనిపిస్తోందే! ఆ పోతు నెయ్యాల్సిందే యిప్పుడు. లేకపోతే అమ్మవారికి తృప్తి కలగదు." అని వీథిగుమ్మం దాటాడు. అందుకుకూడా అంగీకరంచడానికి మామ్మ కష్టపడలేదు. ఛాయాదేవినెవరూ లక్ష్యపెట్టక్కర్లేదు. నందుడి ప్రాణం రక్షించాల్సిన గురుతరబాధ్యతను అక్కడ జేరిన ప్రతిజీవీ తననెత్తి నేసుకుంది. అందుకు మా మ్మేమీ అభ్యంతర పెట్టలేదు. పట్టుపట్టుమని మేకపిల్లదగ్గిరి కెళ్ళారు మెళ్లో పసుపుతాడు కట్టటానికి. ఇందాకా వీరడు తన మొహంవేపు చూసినప్పుడే అనుమానపడిన మేకపిల్ల, మృత్యుచ్ఛాయలవలె తనవేపుకు వాళ్లు రావటంచూసి "మె! మ్మే!!" అంటూ ఒక్క గంతేసి నందుడి మంచం ఎక్కింది. వాడు ఉలిక్కిపడి కదిలాడు. అమ్మవారి మహాత్యం అప్పుడే కనిపిస్తోం దన్నారు చుట్టూ చేరినవాళ్లు. దీని తాతల్లాంటి పోతుల్ని యిట్టే తెగేసిన వీరడికి సైతం యీ మేకపిల్లను పట్టుకోటమే కష్ట మైపోయింది. నలుగురూ చుట్టూ చేరి బంధించబోయేసరికి అందరిమీదనుంచీ చెంగున ఎగిరి బుద్ధభగవాను లున్న గదిలో దూరింది. నిస్సహాయతను ప్రదర్శిస్తున్న ఆ కళ్లకేసి ఒక్కమాటు చూసి, ఛాయాదేవిఒళ్లో పడింది మేకపిల్ల. "దీనిని కూడా పెంచమను. దీని తల్లి చచ్చిపోయింది కూడాను." అని కాదూ తన భర్త దాసితో ఆనాడు చెప్పింది? అలాంటి దీ న్నిప్పుడు కరకు కత్తిపాలు

చేస్తుందా? నందుడో మరి? ఇద్దరూ పోతారేమో! తనుకూడా బలయిపోతే? ఏమైనా సరే యిందుకు తను ఒప్పుకోరాదు..."

దృఢనిశ్చయంతో ఛాయాదేవి మేకపిల్ల మేను నిమురుతూ కన్నీరు కారుస్తుండగా హంతకులు లోపలి కొచ్చారు. ఆమె తీవ్రంగా చూస్తూ "ఇక్కడి నుంచి వెళ్లిపొండి" అని నమ్రతగానే చెప్పింది. "పోతుని ఒదులు..." అంది మామ్మ. "అంతే!" అన్నట్టు వీరడు ఉరిమిచూశాడు. నందుని బతికించి పీతాంబరుడి వంశం నిలపటానికి వాళ్లు కంకణం కట్టుకున్నారు. మామ్మఆసరా చూసుకుని వీరడు ముందుకెళ్లి మేకపిల్ల చెవులు పట్టుకున్నాడు. ఛాయాదేవి ఏడ్చింది. ప్రార్థించింది. అంతకిమించి ఏమీ చేయలేదని అందరికీ తెలిసిపోయింది. మేకపిల్లకీ అర్థమయింది తనని బలిస్తే నందుడు బతుకుతాడుట. పోనీ తన కదే పదివేలు. ఆనాడు కుక్కతో యుద్ధంచేసి వాడిని బతికించలేదూ తను? అలాగే యిప్పుడు తనే ఆహుతయి నందుడి ప్రాణాలు కాపాడుతుంది!

మేకపిల్ల యీమాటు ఏమీ ప్రతిఘటించకుండా వీరడిచేతిలో కొచ్చింది. పసుపుతాడు కట్టారు. మామ్మసలహామీద దాన్ని నందుడి మంచంచుట్టూ మూడుమాట్లు తిప్పారుకూడాను. తథాగతులున్న గదిలో నుంచి ఛాయాదేవి రోదనధ్వనిమాత్రం కొంచెం కొంచెంగా వినిపిస్తోంది. దానికి జవాబుగా మేకపిల్ల "మే! మ్మే!!" అని రెండుమూడుసార్లు అరిచింది మెల్లిగా. నందుడు ఒత్తిగిలాడు. కళ్లు తెరిచి చూశాడుకూడాను. తన ఆత్మబలిదానం సద్యఃఫలితాన్నిస్తున్నందుకు మేకపిల్ల సంతోషాన్ని వెలిబుచ్చుతూ, నందుడి ముంగురులను నాకింది. విజయగర్వంతో కొలుపుసంఘంవాళ్లూ, యితరపెద్దలూ వెళ్లిపోయారు. మనమడికి ప్రాణభిక్ష పెట్టినందుకు మామ్మ అందరికీ కృతజ్ఞత చూపిస్తూ వీడ్కోలిచ్చి లోపలి కొచ్చే సరికి మేకపిల్ల నందుడి మంచ మెక్కి జరిగిన విషయాలన్నీ వాడికి చెబుతున్నట్టుగా మొహంలో మొహం పెట్టి కూర్చునుంది. ఛాయాదేవి కన్నీ రద్దుకుంటూ మంచందగ్గిర నుంచుంది.

౨

తారాగళాల్ని నులిమేసిన జీమూతఖండాలు ఆకాశాన్నంతా ఆక్రమించుకుని చీకట్లు కక్కుతున్నాయి. కాళికాలయప్రాంగణంలోనుంచి వెలువడుతున్న కాహళభేరీధ్వానాలు ప్రాకారంలోని అజకుక్కుటాదుల ఆర్తనాదాల్ని మింగేస్తున్నాయి. గణాచారుల ముందు వేసిన గుగ్గిలధూమాలు పైత్యాధిక్యమున్న జాతరజనంలోకూడా శివాలు పుట్టిస్తున్నాయి. కైపుకోసం పదేపదే తెగతాగిన వధకులు ఒళ్లుతెలీని ఆవేశంతో అమ్మవారి ముందు చిందులు తొక్కుతున్నారు. పశురక్తపానాని కలవాటుపడ్డ కరవాలాలు, కాగడాల వెలుతురులో వధ్యశిలపక్కనే తళతళలాడుతున్నాయి. గర్భగుడిచుట్టూ సంతానాదులకోసం ప్రాణాచారాలు పడిన స్త్రీ లింకా లేవలేదు. కపాలమాలా,రుధిరారుణజిహ్వ,జగన్మాతమాతృహృదయాన్ని హత్యజేసి ఘీంకారాలు చేస్తున్నాయి, యింకా శోణితపాతం మొదలెట్టలేదేమని.

జంతుబలినివారణ ప్రచారసంఘంవాళ్లు చేసిన ప్రబోధానికి ఫలంగా కొలుపుసంఘంవాళ్లు పోలీసుల సహాయం అర్థించి, ౧౪౪ సెక్షను ప్రయోగంకూడా చేయించుకున్నారు. శాంతిభద్రతల రక్షణ అనే పేరుతో నిరాటంకంగా జంతుబలి జరిగే ఏర్పాట్లన్నీ అధికారులు చేశారు. "యథాశక్తిగా ప్రచారంచేశాం. కాగితాలు పంచిపెట్టాం. వాదించదలుచుకున్న వాళ్లతో హేతువాదయుక్తంగా వాదించాం. ఇహ మన మేం చేయగలం?" అనే ఆత్మతృప్తితోనూ, అశక్తతతోనూ ప్రచారసంఘంవాళ్లు జండాలూ, కాగితాలూ వగైరా కట్టలు కట్టేసుకుని తమ కార్యాలయంలో విశ్రమిస్తున్నారు-జంతుబలినివారణాప్రచారం చెయ్యటానికి మొన్నాడు ఏగ్రామం వెళదామా అని ఆలోచిస్తూను. కొలుపుసంఘసభ్యుల ఆహ్వానం మీద, వారితోపాటు విందారగించి తప్పతాగిన రక్షకభటులు కాళికాలయంచుట్టూ కాపలా కాస్తున్నారు, 'పవిత్ర

మైన ఆ బలికార్యానికడ్డం ఒచ్చే ఏ'పైశాచికశక్తి' లోపలికి రాకుండా...

బలి ప్రారంభమైంది. తెగిన గళరక్తనాళంలోంచి, చివ్వున పైకి లేచే నెత్తురుధారలు చూపరుల ఉత్సాహాన్ని యినుమడింపజేస్తున్నాయి. తల లేకుండానే నాలుగుగజాలదూరం పరిగెత్తి పడిపోతున్న ఎనుబోతులు ప్రేక్షకుల వినోదానికాకర మవుతున్నాయి. ఆ రుధిరకాసారాల్ని చూసి కుమిలిపోతున్న ఆదిశక్తిఆక్రందనాన్ని వినే నాథుడే లేకపోయాడు.

కొలుపుసంఘంపెద్ద ఆరా తీస్తే పీతాంబరుడి మేకపోతు యింకా రాలేదని తేలింది. ఇంత రాద్ధాంతం అయింతర్వాత ఊరుకుంటారా? పైగా మీదుకట్టిన పోతుకూడాను. వాళ్ల నందుడు చావటం అటుండగా, అమ్మవారుతల్లికి కోపం ఒచ్చిందంటే ఊరంతా నాశనం చేస్తుంది. పోతుకోసం నలుగురు మనుష్యుల్ని పంపించారు పీతాంబరుడింటికి. ఎవరడ్డం ఒచ్చినా, పడదోసి తీసుకురమ్మని నాయకుడు చెప్పేశాడా మనుష్యులికి. ఆనాడే ఆ పోతు అమ్మవారిదై పోయింది. అమ్మవారి దంటే గ్రామాని దన్నమాట. గ్రామక్షేమంకోసం ఏం చేసినా ఫరవాలేదు.

ఆ మనుష్యు లెళ్లేసరికి మేకపిల్ల మెడ కావిలించుకుని నందుడు పడుకునున్నాడు. మేకపిల్ల చిక్కి సగమైపోయింది. మీదుకట్టిన రోజునుంచీ నందుడు దాన్ని ఒదిలి క్షణంకూడా ఉండటంలేదు. వాడికి ధారకమూ లేదు. మేకపిల్లకూడా గడ్డిపరక కొరికిన పాపాన పోలేదు. నలుగురూ బాగా తాగివున్నారో ఏమో, నందుడిచేతిని బలవంతాన తప్పించి మేకపిల్లను కింపికి లాగేసి తీసికెళ్లారు. వాడు కెవ్వన కేకేసి లేచి పడిపోయాడు. "నాన్నా!" అంటూ ఛాయాదేవి పిల్లాడిని కావిలించుకుంది. మేకపిల్లను మంచంమీదనుంచి దింపటానికి శక్యం కాకుండా యిందాకటినుంచీసతమత మవుతున్న మామ్మకి తృప్తి కలిగింది ఇహ నందుడి ప్రాణాలికే భయమూ లేదని......

ఆ మనుష్యు లలా వెళ్లారో లేదో, ఒక గడ్డపాయన సావిట్లో కొచ్చి మామ్మకి నమస్కారం చేసి "నేను పీతాంబరుణ్ణి...అమ్మవారికి జాత రటగా?" అన్నాడు భార్యకేసి చూస్తూను. వాళ్లు తమ చెవుల్ని తామే నమ్మలేకపోయారు. ఛాయాదేవి సజలనేత్రాలతో భర్తపాదాలమీద వాలింది. తల్లి కావిలించుకుంది. మరణశయ్యమీద ఉన్న తన కుమారుణ్ణి చూశాడు. తన కెదురుపడిన మనుష్యులు తీసుకువెళుతున్నది ఆ మేకపిల్లే అయివుంటుంది. తనయింటి వేపునుంచే ఒచ్చారు వాళ్లు. అయినా సందేహనివృత్తి కోసం "మేకపిల్ల బాగుందా?" అని అడిగాడు. తల్లి యింత మొహం చేసుకుని "బాగానే వుంది నాయనా. అబ్బాయికి ప్రాణంమీది కొస్తేనూ, అమ్మవారు తల్లికి..." అర్థోక్తి లోనే అంతా అర్థమైంది పీతాంబరుడికి. అగ్నిజ్వాలలమధ్య నుంచున్న ట్టనిపించింది. గిరుక్కున పక్కకి తిరిగాడు. గదిలోని గౌతమదేవుల పాలరాతివిగ్రహం మునుపటిమాదిరిగానే ప్రశాంతగంభీరతతో విరాజిల్లుతోంది. ఏదో అవ్యక్తసందేశం ఆతథాగతుని వదనమండలంలోంచి ఆవిర్భవించి పీతాంబరుని విద్యున్మయం చేసింది. అతను త్వరితగతిని కాళీకాలయం చేరుకున్నాడు. ఏదో అనుపమశక్తి అతన్ని నడిపిస్తోంది.

పీతాంబరు డొచ్చా డనే సంగతి అప్పుడే కొందరికి తెలిసిపోయింది. "చచ్చా డన్నారుగా! చచ్చి బతికాడా? అసలు చావనేలేదేమో! ఒకవేళ ఏ దొంగసన్యాసో నేనే పీతాంబరుడి నని బయలుదేరలేదుకదా!...ఈయనగారి అహింసలూ, సత్యాలూ ఏమవుతాయో చూద్దాం. ఇంట్లో పోతునేగా యిచ్చింది. అయినా పాపం, అత నేం చేస్తాడులే! ఆడవాళ్లు చేసిన పనయ్యె..." అప్పుడే కొందరి బుర్రల్లో యిన్నిమాటలూ పుట్టాయి. పీతాంబరు డొచ్చా డనీ, గడ్డం పెంచా డనీ దగ్గిరుండి వేటలు వేయిస్తున్న కొలుపుసంఘంపెద్దకికూడా తెలిసింది. సమయానికే ఒచ్చాడు. తనపోతుని బలిచ్చేటప్పుడు స్వయంగా చూసుకోవచ్చు!

పీతాంబరుడు బలివేదికదగ్గిరి కొచ్చేసరికి మేక పిల్లని వెయ్యబోతున్నారు. "బాబూ, జంతుబలి మానండి." అని బిగ్గరిగా అరుస్తూ అమాంతం ఆ మేక పిల్లని కావిలించుకు పడుకున్నాడు. జనంలో కలవరం బయలుదేరింది. వీరడు ఎత్తిన కత్తి దింపటానికి సాహ సించలేకపోయాడు. ఈ రాత్రి అమ్మవారు నరబలి కోరిం దేమో! పీతాంబరునిలాంటి సత్పురుషుడు బలికి సర్వవిధాలా యోగ్యుడే. వీరడి చేతులు ఒణుకు తున్నాయి. తల తిరిగిపోతోంది. తటపటాయిస్తూ కొలుపుసంఘం పెద్దకేసి చూశాడు. "ఊఁ, కానియ్యి" అని అతను సైగచేశాడో లేదో, కంపిస్తున్న హస్తాల తోనే వీరడు వేటు వేశాడు. నరరక్తం చూసేసరికి వీరడి కళ్లు బైర్లుకమ్మాయి. కల్లుమత్తు దిగింది. కంగా రుగా బైటికి పరిగెత్తాడు. "హత్య! హత్య!!" అంటూ హాహాకారాలు పుట్టాయి. ఇంతలోకే రక్షకభటులు పరిగెత్తుకొచ్చి స్మృతితప్పి పడివున్న పీతాంబరునిని లేవదీశారు. గుబురుగా పెరిగిన అతని జుట్టు అతన్ని రక్షించింది. వీరడు ఒణుకుతున్న చేతులలో వేసిన వేటు గురి తప్పింది. అతని జుట్టుముడిసహా శిరస్సు మీద పెచ్చును లేవదీసుకుంటూ ముందుకు నడచిన ఖడ్గం అతని ఎడమచేతిని సాంతం ఖండించి నేల తాకింది...జాతర అసంపూర్తిగానే పూర్తయింది.

వీరణ్ని అరెస్టుచేశారు. సంఘంపెద్ద లంచా లిచ్చి తప్పించుకున్నాడు. మేకపిల్లతోకూడా నందుడు సైతం క్రమంగా కోలుకున్నాడు. గాయాలు నయమైన తరవాత పీతాంబరుడికి తెలిసింది వీరడిమీద హత్యాయత్న నేరం మోపబడిం దని. అధికారుల్ని వేడుకున్నాడు అతనిమీద కేసు ఎత్తివేయవలసిం దని. వీలు కాదన్నారు వాళ్లు. కాస్తా కూస్తా నేరమా, ఎత్తి వెయ్యటానికి? అదీ గాక, నేరం ఋజువయితే వాళ్లకి ఘనతకూడాను.

చేసే దేం లేక, ఆఖరికి తనే వీరడి తరఫున న్యాయవాదిగా కోర్టులో వాదించటానికి పూను కున్నాడు. ఇలాంటి కేసెక్కడా కనిపించలేదు జడ్జి గారికి కూడా. ప్రభుత్వన్యాయవాదిపని మరీ యిరకా టాన పడింది. ఆఖరికి కేసు కొట్టేశారు.

## 3

అజ్ఞానం మూఢనమ్మకాలికి మంచి ఎరువు. అజ్ఞానం విచ్ఛిన్నం కాగానే మూఢనమ్మకాలు లేచి పోయినా, నమ్మకాల్ని పాలుపోసి పెంచే అలవాటు పడిన ఆ మనుష్యుల హృదయాలు సహేతుకవిశ్వా సాలకు సర్వసమర్పణ చేస్తేనేగాని మనలేవు...వీరడు పీతాంబరునికి దాసోహ మన్నాడు. వేలకొద్దీ మూగ జీవాల పచ్చినెత్తురును అవలీలగా పారిస్తూ ఒచ్చిన వీర డిప్పుడు అహింసావాది అవటమూ, పీతాంబరుని వెంట ఊరూరూ తిరిగి జీవకారుణ్యప్రచారం చేయ డమూ చూస్తే ఆశ్చర్యం కలుగుతోంది. కాని ఏ శాకా హారికీ లేనంత విశ్వాసం అతని కిప్పుడు అహింసావిధా నంలో కలిగిం దనటాని కేమీ సందేహం లేదు. ఒక చెవూ, ఒక కొమ్మూ తెగిన మేకపిల్లా, ఆ మేకపిల్లనే బలిచేయ సిద్ధపడిన వీరడూ, తననే హత్యచేయ సిద్ధ పడిన ఆ వీరడినే రక్షించిన పీతాంబరుడూ జీవ కారుణ్యప్రచారానికి మూర్తీభవించిన ఉత్తమోపదేశా లయ్యారు.

---